మహిళలకు అండగా మజ్లిస్



మహిళల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయం కార్వాన్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మహిళలు ఆయనను కలిశారు. పొదుపు సంఘాల ఏర్పాటుకు తాము గ్రూపులుగా ఏర్పడ్డామని బల్దియా యూసీడీ విభాగం అధికారులతో మాట్లాడి తమకు సహాయం చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో నేడు వందల సంఖ్యలో మహిళా పొదుపు సంఘాలు క్రియాశీలకంగా ఉన్నాయని, తన సలహాలు, సూచనల మేరకే ఈ సంఘాలు స్థాపించబడ్డాయన్నారు.

నిరంజన్ యాదవ్‌కు సత్కారం



నిరంజన్ యాదవ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠి

అబిడ్స్: భాగ్యనగర్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన నిరంజన్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గానికి భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి చైర్మన్ డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రాఠి, ఇతర బీజేపీ నేతలు సుమిత్‌రాఠి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనాథ్, వినోద్‌గౌడ్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠిలు మాట్లాడుతూ..భాగ్యనగర్ జిల్లాలో బీజేపీ మరింత పటిష్టంగా మారుతుందన్నారు. నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ తిరుగులేని శక్తిగా ఉద్భవిస్తుందన్నారు.

సన్మానం



నిరంజన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఉదయ్ కిరణ్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన నిరంజన్ యాదవ్ బుధవారం అలియాబాద్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

సంతోష్‌నగర్‌లో అగ్ని ప్రమాదం



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని లక్ష్మీ డయాగ్నోస్టిక్ అండ్ స్పెషాలిటీ ల్యాబ్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన నిర్వాహకులు మలక్‌పేట్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో దాదాపు రూ.40 లక్షల వరకు ఆస్తినష్ట జరినట్లు నిర్వాహకులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మణికొండ: ఓయూ కాలనీ శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. 9 రోజుల పాటు రోజూ సాయంత్రం ఓ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. మొదటి రోజు 30వ తేదీన ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఏప్రిల్ 3న చండీహోమం, అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శిథిలావస్థలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లు

నిలిచిపోయిన సంక్షేమ కార్యక్రమాలు

- పెచ్చులూడడంతో వర్షపు నీరు హాల్‌లోకి వస్తున్న వైనం
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు


జియాగూడ: ఇమాంపురాలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాళ్లు రెండు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1970లో అప్పటి ఎమ్మెల్యే నాగం కృష్ణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించిన కమ్యూనిటీ హాళ్లు ఎన్నో ప్రజా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడేవి. జీహెచ్‌ఎంసీ ద్వారా ప్రతి రెండేళ్లకు ఒకసారి మరమ్మతులు, రంగులు వేయడం జరిగేది. కొన్ని సంవత్సరాల నుంచి కమ్యూనిటీ హాళ్ల బాగోగులను జీహెచ్‌ఎంసీ పట్టించుకోవడం లేదు.

వర్షం వస్తే నీరు హాల్‌లోకే..

1970లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవన గోడలు, మెట్లు, రూఫ్, సిమెంట్ పిల్లర్లు పడిపోగా ఇనుప చువ్వలు తేలుతున్నాయి. అదనపు కమ్యూనిటీ హాల్‌లో వ్యాయామశాల కొనసాగుతున్నప్పటికీ అరకొర సామగ్రి ఉండగా, హాల్ పైన పెచ్చులూడడంతో వర్షం వస్తే నిరంతరం కింద ఉన్న హాల్‌లోకి వస్తుంది. దీంతో కమ్యూనిటీ హాళ్లు పూర్తిగా వాడుకలోకి లేకుండా పోయాయి.

అటకెక్కిన సంక్షేమ కార్యక్రమాలు..

ఇమాంపురాలో సుమారు 350కి పైగా నివాసాలు ఉండగా జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేవి. కమ్యూనిటీ శిథిలావస్థకు చేరడంతో నవ భారత్ సంఘం సమావేశాలు, ప్రభుత్వ పల్స్ పోలియో, యూసీడీ ద్వారా మినీ ఆసుపత్రి అంగన్‌వాడీ కేంద్రం, మాత, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, జాతీయ జెండా పండుగలు లాంటివి అన్ని నిలిచిపోయాయి. ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో దీని చుట్టు పక్కలకు సైతం ప్రజలు రావడం మానేశారు.



జీహెచ్‌ఎంసీ కమిటీ హాల్ రూఫ్ పెచ్చులూడుతున్న దృశ్యం



అధ్వానంగా ఇమాంపురా జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్



అదనపు కమిటీ హాల్ ఇలా..

కమ్యూనిటీ హాల్‌ను జీ ప్లస్-1గా నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను నూతనంగా జీ ప్లస్-1గా నిర్మించాలని కార్పొరేటర్ దర్శన్ ద్వారా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నూతన భవనం నిర్మించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తేవాలి.

– మధిర సత్యనారాయణ, నవభారత్ సంఘం అధ్యక్షుడు

యువతకు వ్యాయామ సామగ్రి అందించాలి



ఇమాంపురా అదనపు భవనంలో కొనసాగుతున్న వ్యాయామశాలకు అదనంగా జీహెచ్‌ఎంసీ వ్యాయామ సామగ్రిని అందించాలి. అలాగే వర్షం పడితే నీరు భవనంలోకి వస్తుంది. రూఫ్‌పై ఫినిషింగ్ చేస్తే కురవదు. అలాగే యూత్‌కు వివిధ రకాల క్రీడా సామగ్రిని అందించాలి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– మహేష్ బాబు, కోశాధికారి

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అబిడ్స్‌లోని కార్యాలయం వద్ద అక్రమ కట్టడాల ఫొటోలు, వివరాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలు తనకు పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో తాను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు, 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. గోషామహల్ పాన్‌మండి వద్ద అక్రమ లేఅవుట్‌లో ఎలా నిర్మాణాలకు అనుమతులు ఇస్తారని ఆయన ప్రశ్నించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

ఆధారాలతో సహా అక్రమ నిర్మాణాలపై తాను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశానన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిచో ట్యాంక్‌బండ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

శ్రీరామ నవమి శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేయాలి



పలు శాఖల అధికారులతో సమావేశమైన డీసీపీ చంద్రమోహన్

అఫ్జల్‌గంజ్: శ్రీరామ నవమి శోభాయాత్రకు అన్నిశాఖల అధికారులు సమన్వయమై అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో పలు శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏప్రిల్ 6న ధూల్‌పేట నుంచి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగే శ్రీరామనవమి శోభాయాత్రకు పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్, ఆర్టీఏ, ఫైర్, జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు ఇతర శాఖల అధికారులు సమన్వయంగా ఉండి ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర కొనసాగే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. శోభాయాత్ర కొనసాగే దారిపొడవున, కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా ముమ్మరం చేస్తామన్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగే విధంగా అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, షాహినాయత్ గంజ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్లు నాగం రవీందర్, మహేష్ గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరిస్తున్న రసరంజని నాటకోత్సవాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని 32వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న రసరంజని నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. 2వ రోజు అయిన బుధవారం ప్రముఖ రంగస్థల దర్శకుడు మోహన్ సేనాపతి దర్శకత్వంలో ప్రదర్శించిన చైర్మన్ అనే నాటకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ.. నాటకాలను నేటి యువతరానికి తెలిసేలా ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం రంగస్థల కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రనాటక కళాపరిషత్ అధ్యక్షుడు బి.కృష్ణయ్య, సినీనటుడు సుబ్బరాయశర్మ, రచయిత మాడభూషి దివాకర్‌బాబు, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మోహన్ సేనాపతిని సత్కరిస్తున్న పలువురు ప్రముఖులు

'అక్షయపాత్ర'కు విద్యుత్ వాహనాల అందజేత

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్‌లు, అంగన్‌వాడీలు, నగరంలో రూ. 5కు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాఘ్ బక్రీ ఫౌండేషన్ తన తోడ్పాటును అందించింది. బుధవారం నార్సింగిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ వద్ద భోజనాన్ని తరలించేందుకు అవసరమైన 9 ఎలక్ట్రిక్ వాహనాలను అందజేశారు. ఆహారం తాజాదనాన్ని కాపాడేలా టెంపరేచర్ కంట్రోల్ సౌకర్యంతో వాటిని ప్రత్యేకంగా తయారు చేశారు. ప్రముఖ టీవీ నటి సుమ కనకాల, వాఘ్ బక్రీ టీ గ్రూప్ సీఈఓ సంజయ్‌సింగ్‌లు అక్షయపాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యాగ్నేశ్వర్‌దాస్‌కు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్రకు తమ వంతు తోడ్పాటును అందిస్తామన్నారు. అక్షయపాత్ర 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 78 ప్రదేశాల్లో వంటశాలలను నిర్వహిస్తున్నదన్నారు. 23 వేల పాఠశాలలు, అంగన్‌వాడీలకు 22.5 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నదన్నారు. వాఘ్‌బక్రీ ఫౌండేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్‌శిండే, దక్షిణ విభాగం అధిపతి పి.వి.సురేష్, సీఎస్ఆర్ అధిపతి అజయ్ సిసిలియా తదితరులు పాల్గొన్నారు.

మామిడిని రసాయనాలతో మగ్గబెట్టే వారిపై చర్యలు తీసుకోండి

బంజారాహిల్స్: మామిడి పండ్లను ప్రమాదకర, నిషేధిత రసాయనాలతో మగ్గిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పండ్లు రవాణా చేసే వాహనాలను తనిఖీ చేయాలని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు కోరారు. బుధవారం ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని చెక్‌పోస్టుల వద్ద పండ్లు రవాణా చేసే లారీలను చెక్‌చేసేందుకు విజిలెన్స్ అధికారులతో పాటు సర్క్యులర్‌ను జారీ చేయాలని కోరారు. రసాయనాలతో మగ్గించిన పండ్లు తిని ప్రజలు ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వచ్చే వాహనాలతో పాటు మన రాష్ట్రం నుంచి కూడా ఇతర రాష్ట్రాలకు వందలాది పండ్ల లారీలు కెమికల్స్‌తో మగ్గించిన పండ్లను సరఫరా చేస్తున్నారని అన్నారు. పండ్ల మార్కెట్లలో కూడా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిషేధిత రసాయనాలను అధిక మోతాదులో వాడటం వల్ల ఎంతో మంది పండ్లు తిని అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలైన ఘటనలను వారు ఆయనకు వివరించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



టప్పాచబుత్రలో...

విజయనగర్‌కాలనీ: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తున్నాయని కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్ అన్నారు. బుధవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వామి యాదవ్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఐఎం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోల్కొండ రిసాల బజార్‌లో...

గోల్కొండ: ప్రముఖ న్యాయవాది గోల్కొండకు చెందిన బి.వాణిశ్రీ గోల్కొండ రిసాల బజార్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్‌లో ఆమె స్థానిక మహిళలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక ముస్లిం మహిళలు సలీమా, ఆలియా మాట్లాడుతూ.. పదేళ్లుగా తాము బొమ్మల వాణిశ్రీ ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందుకు హాజరవుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, పద్మ, సుజాత, సాయిబాబాచారి, శ్రీకాంత్‌చారి, నజీబ్ తదితరులున్నారు.



రిసాలబజార్‌లో..

శోభాయాత్ర రూట్‌ను పర్యవేక్షించిన అధికారులు

సుల్తాన్‌బజార్: ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరాముని శోభాయాత్రకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి నేతృత్వంలో సుల్తాన్ బజార్ నుంచి హనుమాన్ టేక్డీలోని హనుమాన్ వ్యాయామశాల స్టేడియాన్ని పర్యవేక్షించారు. ఆయనతో పాటు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, జలమండలి, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, విద్యుత్, మెడికల్ అండ్ హెల్త్, ఫైర్ సర్వీసెస్, ట్రాఫిక్ పోలీస్ టీఎస్ఆర్టీసీ, హార్టికల్చర్‌కు చెందిన అధికారులు శోభాయాత్ర జరిగే ప్రాంతాలను పర్యవేక్షించారు. సిద్ధి అంబర్‌బజార్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు డీసీపీ బాలస్వామి బృందం ఎక్కడెక్కడ బందోబస్తు నిర్వహించాలో..సమస్యాత్మక ప్రాంతాలు ఏమిటో తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్‌శాఖ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పెండింగ్‌లో ఉన్న రోడ్డు ట్యాక్స్ వర్క్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పార్టీ పటిష్టతకు సోషల్ మీడియా ప్రతినిధులు కృషి చేయాలి

చార్మినార్: పార్టీని మరింత పటిష్టం చేయడానికి సోషల్ మీడియా పాత్ర ఎంతో ఉంటుందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర అన్నారు. ఇందు కోసం సోషల్ మీడియా ప్రతినిధులు నిరంతరం కృషి చేయాలన్నారు. బుధవారం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కొమ్మరాజు సుమిరాన్, కో కన్వీనర్ అక్కలదేవి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం టి.ఉమామహేంద్రతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేంద్ర మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల వివరాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువయ్యేటట్లు ప్రచారం కల్పించాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలను ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేయాలన్నారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ పట్ల దుష్ప్రచారం చేస్తే వెంటనే తిప్పి కొట్టాలని ఆయన సోషల్ మీడియా ప్రతినిధులకు సూచించారు.



రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఉమామహేంద్ర తదితరులు

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం



క్రీడాకారులతో మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: మాదకద్రవ్య రహిత సమాజాన్ని తయారు చేయడమే తమ లక్ష్యమని మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఎల్బీస్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పేరుతో పలువురు క్రీడాకారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొలను జగ్జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో చాలా మంది పిల్లలు మాదకద్రవ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలన సేవలకు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని తల్లిదండ్రులు కూడా పిల్లలను రక్షించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ అసోసియేషన్ వైస్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, అధ్యక్షుడు ఎంజీఏటీ, కార్యదర్శి డాక్టర్ వై.రామారావు, డాక్టర్ ప్రసాద్, ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రల అందజేత

చాంద్రాయణగుట్ట: బీజేపీ సీనియర్ నాయకుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్ లలితాబాగ్ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం వంట పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కౌమార దశ బాలికలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. గతంలో తాను అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసినప్పుడు గుడ్లు ఉడికించడం, ఇతర వంటకాలు వండేందుకు నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయమై వెంటనే తన సొంత నిధులతో ఆయా సామగ్రిని సమకూర్చానన్నారు.



వంట పాత్రలను అందజేస్తున్న చంద్రశేఖర్

సమాజ సేవకు వెలకట్టలేం

గోల్కొండ: సమాజ సేవకు వెలకట్టలేమని ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ ఆయిషా సుల్తానా అన్నారు. బుధవారం ఆమె టోలిచౌకీ అక్బర్‌బాగ్ కాలనీలోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్‌ను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..15 ఏళ్లుగా టీఎఫ్‌సీఓ చైర్మన్‌గా మహ్మద్ నజీబ్ పనిచేస్తూ ఎన్నో కుటుంబ తగాదాలను పరిష్కరించడం అభినందనీయమన్నారు. అయితే నేటి సమాజంలో యువ దంపతులు సైతం చిటికీ మాటికి కొట్లాడుకుంటూ పోలీస్ స్టేషన్లు, కోర్టుల చట్టూ తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వారికి కౌన్సెలింగ్ ఇస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీఓ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాజ్, సాయిలు, మన్నాన్ తదితరులున్నారు.



మహ్మద్ నజీబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విద్యాశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్: విద్యాశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీఓస్ కేంద్రసంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖకు నూతనంగా ఎన్నికైన సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఫక్రుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ దేవేంద్ర కుమార్, పవన్‌బాబు ఆధ్వర్యంలో వారిని గజమాలలతో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..పాఠశాల విద్యాశాఖ ఫోరం ఉద్యోగులకు అండగా ఉండి ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో జోనల్, మల్టీజోనల్ కార్యాలయాల ఏర్పాటు, అసిస్టెంట్ డైరెక్టర్ల పోస్టులు, మల్టీజోనల్ అలోట్‌మెంట్ కోసం టీఎన్జీఓస్ కేంద్ర సంఘం కృషి చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, మిడ్డేమిల్స్ పోస్టులు, మోడల్స్ స్కూల్స్ పోస్టులు, ఆర్ఎంఎస్ఏ పోస్టులు శాంక్షన్ అయ్యే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ..విద్యాశాఖలో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌ల దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం.భాస్కర్, ఆర్.అశోక్, దిలీప్, ప్రశాంత్, ఉస్మాన్, దుర్గాప్రసాద్, రమేష్, సుదర్శన్, శివ, అరుణజ్యోతి, అఖిలుద్దీన్, పరమేష్, దామోధర్ తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్‌ను గజమాలతో సత్కరిస్తున్న కేఆర్ రాజ్‌కుమార్ తదితరులు

అభివృద్ధి పనుల పరిశీలన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఎర్రకుంట డెవలప్‌మెంట్‌లో భాగంగా బుధవారం అధికారులు పర్యవేక్షించారు. సేల్స్ ఫోర్స్, గ్రీన్ యాత్ర కంపెనీ, బయోడైవర్సిటీ పార్క్ బెంగుళూరు కంపెనీ బృందంతో కలిసి గ్రీనరీని పరిశీలించారు. మొదట విడతలో గ్రీనరీ డెవలప్‌మెంట్, రెండో విడతలో లేక్ డెవలప్‌మెంట్, రెయిన్ వాటర్‌ని కుంటలోకి తరలించేలా అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ డీఈ యాదయ్య, మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు